# కామమ్మ కష్టాలు

లోకల్ బోర్డుల ఎలెక్షనులకోసం, బస్తీలలోని సానివారికోసం అప్పులు చేసినవాగికైన రక్షణనిచ్చిన రైతుచట్టం యీ నిర్భాగ్యుడికి వర్తించదుగా? దేశంకోశం సర్వసూన్యమైన యీ నిరుద్యోగికి పునాదిమార్గం కాంగ్రెసు మంత్రులు కనిపెట్టరుగా?

యీ నిష్కళంక దేశభక్తులును త్యాగధనులును అయిన యీ ఆదర్శదంపతుల భావిజీవితం బాగుచేయవలసినది పాలకులా, ప్రజలా, భగవంతుడా?

కామమ్మ కాపురానికివచ్చిన కొద్దికాలంలోనే, కాంగ్రేసోద్యమం తీవ్రరూపంగావుంది. మారుమూలల వున్న పల్లెగ్రామాదుల్లోకికూడా ఉద్యమప్రచారం ఉత్సాహంగా జరుగుతూవుంది. ఆబాలగోపాలము గాంధిమహాత్ముని నాయకత్వంక్రింద కాంగ్రెసురథం స్వరాజ్యసౌధం దగ్గరకు లాక్కెళ్లుతున్నారు. విశ్వనాథంకూడా విద్యకు స్వస్తిచెప్పి ఉద్యమంలో జొరబడ్డాడు. తానున్న పల్లెగ్రామంలోనే కాంగ్రెస్ శిబిరంపెట్టి తానేపెద్దగా వ్యవహరిస్తున్నాడు. దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు, తెరపిలేకుండా తెప్పించి ప్రజలకు ప్రచారంచేస్తూవున్నాడు. పల్లెటూరయినా పట్నవాసములోనికి వచ్చేప్రనాయకుల్ని సపరివారంగా ఆహ్వానించి సభలు జరుపుతూవుండేవాడు. ఊరేగింపని ఉత్సవాలని ఉపన్యాసాలని వందలకొలది వాలంటీర్లను రప్పించి షడ్రసోపేతంగా భోజనమజ్జనాదులతో సత్కరించి పంపుతూవుండేవాడు. సందుచూచుకొని సంగ్రహించటానికని తయారైన దొంగవాలంటీర్లు యీయన అమాయికత్వాన్ని అవకాశంగా చూచుకొని, దోచేస్తుండేవాళ్లు. సన్నని అహమదాబాద మిల్లుధోవతి, గ్లాస్కోమల్లు లాల్చి తొడుక్కొని పంకరక్రాసింగు నీటుగా దువ్వి వల్లెవాటువేసికొని తిర్గే విశ్వనాథం యిప్పుడు అవన్ని అమాంతం తగలేసి ముతకఖద్దరుధోవతి అట్లాటిదేలాల్చి గాంధిటోపితో కళకళలాడుతున్నాడు. బంగారానికి వెలిగారం తోడయినట్టు పువ్వుకు తావిఏకమైనట్టు విశ్వనాథానికి కామమ్మ నిజమైనఅర్ధాంగిగా ప్రవర్తించేది ఉద్యమంలోను వేషంలోనుకూడా. తెలగులాబి చీర, పియర్సువారి సబ్బు, జపానువారిలేసు, ఎక్కడవున్నవో కూడాఎగరదా మహోయిల్లాలు. అన్నీవదలేసి అచ్చమైన ముతకఖద్దరుచీరె అలంకరించుకుని, వచ్చిపోయ్యేవారి వంటలకుగా తయారై భర్తకు చేదోడుగా వుండి ఆయనను సంతోషపెట్టేది.

ఉద్యమం వృద్ధిఅయినకొద్ది విశ్వనాథం వుత్సాహం ఎక్కువౌతూంది. వచ్చిపోయ్యే వాలంటీర్లతో జనరాజనాలకు, ఉత్సవాలకు వూరేగింపులకు మితంలేకుండా ఖర్చుచేస్తున్నాడు విశ్వనాథం. ఆదివరకు వాళ్ల నాన్నవుండగా ఖాతావుంచిన షేరాజు దగ్గరే తనచదువుకోసం వాళ్లమ్మ అప్పుచేసింది. ఆ ఖాతానే పెంచేస్తున్నాడు మనవిశ్వనాథం. రాసిన చీటికి ఎదురులేకుండా సోమ్ము వస్తూనేవుంది, నాన్నగారి కాలంనుంచి బకాయి. అందుపైన వాళ్లమ్మ తన చదువుకోసం చేసినఅప్పు. అటుపైన యిప్పుడిది, యీవిధంగా పెరుగుతూవున్నదా రుణం.

చిన్నతనములోనే తండ్రిపోయినా అబ్బాయికి కాస్త యింగ్లీషువిద్య చెప్పిస్తే, అక్కరకువస్తాడుగదా అని అయిదారువేలు ఖర్చుచేసి, బస్తీల్లో అద్దెకొంపల్లో నానా అగచాట్లుపడి, మొగపనికి ఆడపనికి తానే సిద్ధమయి చదువుచెప్పించి, పెండ్లిచేసి యింతటివాడ్ని చేసినందుకు, చదువులు చట్టుబండలుచేసికొని సంపాదన లేకుండా, కాంగ్రెసని, గద్దెలని అనవసరంగా అప్పుచేసి ఖర్చుపెడుతూ యిల్లుపట్టకుండా జనంనింపుతూ యీవుద్యమంలో యిష్టమైనట్టు విశ్వనాథం తిరగటం సహించలేకపోయింది సూరమ్మ. సమయముచూచి

చీవాట్లేద్దామనుకుంటే ఎప్పుడూసందడిగానే వుంటుంది కొంపలో.

కామమ్మకిదంతా గమ్మత్తుగానేవుంది. వచ్చి పోయ్యే జనాన్నిచూస్తూ పెద్దపెద్ద నాయకుల ఉపన్యాసాలువింటూ, పత్రికల్లోని వ్యాసాలు చదువుతూవుంటే, కామమ్మకు కండ్లపండువుగావుంది. దేశమింత దౌర్భాగ్యస్థితిలోవుండటం ఆమెకు సహింపుగా లేదు. అట్టి దుర్భరదాస్యం తొలగించే వుద్యమంలో భర్తచేరి పెద్దపెద్దవారిలో పేరుతెచ్చుకోటం ఆమెకు ఘనతగానేవుంది. అత్తగారిభయముందిగాని లేకపోతే తోటిఆడవాళ్లల్లే తానుగూడా ఉద్యమంలోకి ఉరికి భర్త పోటోప్రక్కన తనపోటోకూడా పత్రికల్లో ఎక్కించుకోవాలనేవుంది. యీ స్థితిలో వున్న కామమ్మ దగ్గరకు సూరమ్మ వచ్చింది.

సూ:—కామమ్మా నీకైనా బుద్ధిలేదుటే, మొగవాడు పాడుసావాసాన పాడయిపోతుంటే యింటికైన యిల్లాలివి నీవైనా బుద్ధిచెప్పొద్దుటే?

కా:—ఇప్పుడు వారు చెడిపోతున్నదేమిటి, నే చెప్పాల్సిన నీతులేమిటి?

సూ:—ఏమిటూ, ఎరగనట్టు నంగనాచిలా మాటాడుతున్నావే? దమ్మిడీ సంపాద్యం లేకపోగా కొంప గుల్లచేస్తుంటే చూడ్డంలా?

కా:—జూదమాడుతున్నా రంటూరా, భోగం వాండ్లకు పెట్టున్నా రంటూరా?

సూ:—యీ వున్నదానికి దోడు అవికూడావుంటే అడుక్కే తింటారు.

కా:—అట్లాటి దుర్మార్గాలు చేస్తుంటే అడుగైనా కదలనివ్వ ననుకోండి.

సూ:—నీమతి మండిపోను! యీ కాంగ్రెసువాళ్లేమిటి గాంధీటోపీలేమిటి మాలా మాదిగ ఏకం చేస్కుంటూ కొంపనిండా చేర్చటమేమిటి? రోజూ పిండివంటల్తో యీ సంతర్పణమేమిటి? యిదేమయినా బాగుపడే బుద్ధులేనా? ఆ వున్న అయిదెకరాలు అప్పు క్రింద పోతే ఆనక అడుక్కు తింటారా?

కా:—నాకు పోసిన దేవుడు నీకు పొయ్యడా? అంత కాలమేవస్తే.

సూ:—సారంనీతులు చెప్పటంకాదు అనుభవించే నాడు తెలుస్తుంది అగచాట్లు. యిప్పుడు ఎక్కడ కనబడ్డవాళ్ల నక్కడ లాటీల్తో పడేస్తున్నారట కూడాను.

కా:—కోటీశ్వర్లెదురుతున్నారు కోట్లల్లోకి మన మొక లెక్కా?

సూ;—కోటీశ్వరులెళ్లారని గోచిపాత రాయళ్లు సిద్ధమవుతారటే! తరగని ద్రవ్యమున్నవాళ్లు ఏ తందనాలు దొక్కినా చెల్లుతుంది. మాలకూడుతిన్నా వాళ్ల ననేవారు లేరు. మనబోటివాళ్ల నప్పుడే వెలేస్తారు.

కా:—అంతంతవాళ్లే అగచాట్లుపడి స్వరాజ్యం కోసం పాటుబడుతుంటే మనంటివాళ్లం వూరుకుంటామా? మాలకూడేమిటి, వాండ్లుమాత్రం మనంటి వాండ్లు కారటండీ? అంతా ఓతల్లి పిల్లలమే నన్నాడు గాంధి మహాత్ముడు.

సూ:—ఇక నోరుమూసుకో. నీవు వాడితోచేరి అన్నివిధాల చెడిపోయినావు. ఆడది ఆడదాని బుద్ధులు నీదగ్గరలేవు. నీవిట్లా కాబట్టే వాడట్లా వూరేగుతున్నాడు. నీవు కాస్త నోరుచేసుకొని ఎదురుతిర్గి మాట్లాడితే వాడట్లా ఆడువాడా? అదిగాక, లేవలేందానవు అడ్డమైన చాకిరిచేసి వండడాలు వడ్డన్లు చేస్తుంటే ఏనరం చెదిర్నా ఆనక ఏతిప్పలు పడాలో తెలుసునా?

కా:—ఏమన్నారు ఎదురుతిర్గమన్నారా? బాగానే వుంది. చెయ్యటం చేతగాకపోగా దేశసేవ చేసేవాళ్లను వద్దనిచెప్పనా? అర్ధాంగి అయినవాళ్లు అన్నివిధాల తోడ్పడి మొగుళ్లకు వుత్సాహాన్ని వృద్ధిచెయ్యాలిగాని ఎదురుతిర్గి ఆటంకం కల్గచెయ్యటం అక్రమం కాదటండీ.

సూ:—పతివ్రతాధర్మం బంధమైనట్లేవుంది.

విశ్వనాథం వీధిలోంచి వస్తున్న చప్పుడు వినిపించింది. వీధిగుమ్మంవంక తిర్గిచూచారు. మెళ్లో గులాబిపూలదండ. పక్కన యిద్దరు పోలీసువాళ్లు ఒకఇన్‌స్పెక్టరు, యిల్లుపట్టకండా జనం యీస్థితిలో తయారయ్యారు విశ్వనాథం. ఆ దృశ్యం చూడగానే కామమ్మ కళ్లు మూసికోపోయినయి. గుండెల్లో శైళ్లు పరుగెత్తినై. అత్తగారు తన మొగుణ్ణి కౌగిలించుకొని యిక తప్పుచేయనని చెప్పరా నాయనా అనేటప్పటిక్కి విదిలించిపారేశాడు విశ్వనాథం. ఆమాట అనకండా జైలుకుపోకుండావుంటానని వుపాయంవుంటే బావుండుననుకొంది. మొగుణ్ణి తన్నూ ఒక కొట్లోవేస్తే తానూ వెల్దామనుకొంది. విడిచిపెట్టివుండలేనే అని మనసు కలవరంగానేవుంది. ఆయన వెళ్లింతరువాత ఎట్లానా అని వూహాప్రపంచంలో మున్గిపోయింది. ఏమి చెప్పటానికి నోరాడ్డంలేదు. ఏమేమో అనుకొందిగాని చివరా మొదలులేవా వూహాలకు. యిందాకట్నుంచి అత్తగారు చెప్పింది వినదగిన సలహానా అనుకుంది. ఛీ! అది తప్పనుకుంది మళ్లీ.

విశ్వ:—కామేశ్వరీ వెళ్లివస్తాను. వీలయితే నీవు కూడ వచ్చె త్వరలో.

కా:—(కండ్లనిండా నీళ్లుతిర్గినయి. నోటెంబడి మాటరాలేదు. అదోరకం చూపు చూస్తూనిల్చింది).

ఆచూపులో ఏవో అర్థముంది. అది చూడగానే అప్రయత్నంగా విశ్వనాథం కండ్లలోంచి రెండు నీటిచుక్కలు రాలాయి. వుత్సాహంతో వుట్టిపడే మొఖంలో ఓవింతమార్పు కల్గింది. ఒకరికళ్లలోకి ఒకరుచూచుకొన్నారు. అనురాగయుక్తులైన దంపతులు నియోగ్గభారం భరించలేక అట్లా అయిందనుకొందామా? అట్టే నిష్కళంకమైన దేశభక్తులు అది ఒక లెక్కగా చూస్తారా? అదికాదు. అయితే దానిఅర్థం వారికే తెలియాలి.

విశ్వ:—ఉత్తరాలు వ్రాస్తూవుండు అమ్మను బెంగలేకుండా చెయి.

కా:—(తలవంచుకొని దీనంగా) శిక్ష ఎన్నాళ్లు?

విశ్వ:—అది మనకిప్పుడు తెలియదు.

ఇన్‌స్పెక్టరు:—ఇక నడవండి, బజారునుంచి అట్లాగే తీసుకవెళ్లాల్సింది. ఎదో తెలిసినవాళ్లని అవకాశమిస్తే అనవసరంగా ఆలశ్యం చేస్తున్నారు. టైం అయింది పదండి.

తన ప్రియుడితో ఆఖరుచూపుగా మళ్లా ఎన్నాళ్లకొస్తారోనని మనసార మాట్లాడ్డానికి అనవసరంగా అడ్డం కలిగించి ఆయన్ను యింకో పది నిమిషాలన్నా తన ఎదుట లేకుండా తీసుకపోవటానికి తొందరజేస్తున్న పోలీసువారి వైఖరి కామమ్మ సహించలేకపోయింది. తోడిసోదరుని, దేశంకోశం పాటుబడే ధీరుణ్ణి తమ చేతిమీదుగా జైలుకు తీసుకోపోతూవున్న దోషంగాక, నిష్కల్మషమైన ప్రేమపాశములచే కట్టబడియున్న దంపతుల అనురాగలతను తాత్కాలిక వియోగముకల్గించి త్రెంచుటకు సిద్ధపడిన పాపముగాక వారి ఉభయులను మనసార మాటాడకుండా నిరోధముచేసే అవినీతి వర్తనంకూడా ఎందుకుచేశాడా అనుకొంది. ఇంతటి క్రూరత్వము వాళ్లకు రావటానికి కారణమేమిటి? వాళ్లుకూడా హైందవులేకదా అని వూహించుకొంది. అది ప్రపంచ జ్ఞానశూన్యత, అదికాదు, అధికార మదోన్మత్తత, అదియుకాదు కడుపుకక్కుర్తి ఉద్యోగ ధర్మము. ఏదయినకానిండు కామమ్మకు మాత్రం క్షమార్పణంగాలేదు. మంత్రరుద్ధభుజంగం ఏమిచేయగలదు. శాంతం శాంతం అంటాడు పిచ్చిగాంధి. యిట్లాటి సమయంలోనా శాంతం అనుకుంది. లేకపోతే ఏంచేసేదో? ఏంచేసేదా కైటభాసురమర్దని కాళిని జ్ఞాపకముచేసేదే. స్త్రీ సాహసం ఏమో. ఏంచేసేదో? గ్రుడ్లురిమి ఒక్కచూపు చూచింది ఆపోలీసు ఇన్‌స్పెక్టరు వంక.

# కామమ్మ కష్టాలు

సూ:—ఏమిరా నాయనా మాగతెట్లారా?

విశ్వ——కు భగవంతుడు వున్నాడు. వెళ్లి వస్తాను. వాకిట్లోవరకు వెంబడించింది కామమ్మ. వేల కొలది జనం వెంటబోతున్నారు. బ్యాండుమేళాలు దిక్కులు మారుమోగుతున్నాయి. ముత్తైదులు హారతులిస్తున్నారు. భర్తపేర జేజేలు కొటుతున్నారు. గర్వంతో పొంగిపోతూ చూస్తున్నది కామమ్మ కను చూపు మేరకు.

కళ్లనీళ్లు తుడుచుకుంటూ యింట్లోకి చేరింది. అవి ఆనంద భాష్పాలో దుఃఖాశ్రువులో రెండు కల్సినవో. అత్తగార్ని ఓదారుస్తూ ఆరాత్రి గడపింది. శిక్ష ఎన్నాళ్లు పడ్డదో యిక వినాల్సిన తరవాయి.

తెల్లవారింది. వీధి గుమ్మంలోకి ఎదురుచూస్తూ వుంది. ఎవరైనవచ్చి ఆవార్త చెప్పుతారేమోనని. కళ కళలాడే యిల్లు చిన్నబోయింది. వందలకొద్ది వచ్చే వాలంటీర్లు యిప్పు డేమయినారో ఒక్కరూ కనపడరు. యిన్నాళ్లు యింటిపొరుగు అమ్మలక్కలైనా వచ్చేవారు. ఆ యింటికి వెళ్లితే ఏమొస్తుందో నని ఎవరూరారు. ఎక్కడ నిలుచున్నా ఏమితోచటంలేదు. కాలుగాలిన పిల్లిలా తిరుగుతూవుంది. యింట్లోకి బయటికి, ఆనోటా ఆనోటా అది ఎట్లాగో తెలిసింది, ఏడాది శిక్ష అయిదువందలు జుల్మానా వేశారని కామమ్మకు. పిడుగువంటి ఆవార్త వినదగిందిగా లేదామెకు.

మనసులో బండపడ్డట్టయింది. యిక ఏడాదికి భర్తనుచూచే భాగ్యము. ఒక్క నిట్టూర్పు విడిచింది. అత్తగారి వంకచూచి తాను విన్నసంగతి చెప్పింది.

ఆమె బావురుమన్నది. గుండె గుండె బాదుకొన్నది. యిక జీవించి వస్తాడా అని యేడ్చింది. మనుమడు కల్గితే బారసాల పీటలమీద కొడుకు కోడలు వళ్లో పిల్లాన్ని పెట్టుకూచుంటే చూద్దామనుకొన్న సూరమ్మ ఆశ అడుగంటిందని విచారించింది. పుట్టేవాడు నిర్భాగ్యుడు కాబట్టే తండ్రి జైలుకు పొయ్యాడని, జరాయు పిండాన్ని తిట్టిపోసింది. చేయగల్గిందిలేదని నిస్పృహ చెంది వూరుకుంది.

కాలంగడుస్తూ రోజులు వారాలవుతున్నవి. వారాలు నెలలవుతున్నయి. అత్తగారు దిగుల్తో మంచంపట్టింది. భర్త జైల్లో బాధపడుతున్నాడు. తాను లేవలేనిస్థితి. పదోమాసం. యింట్లో ఆశనానికి అంతంతమాత్రంగావుంది. పేరాజా చితా మత్తర్పు చేశాడు. బాకీకి లాయర్నోటీసిప్పించాడు. బంధుగులైనవారు పరామర్శకైనా రావటంలేదు. తిండిజర్గటం కష్టంగావుంది. రాట్నం వడికి ఆ నూలుతో వింతవింత అల్లికపనులు చేసి అభిమానులగు వారికవి అమ్మి దాన్తో జీవయాత్ర గడుపుతూవుంది. చినిగిపోయిన చీరలే సింగారించుకొంటున్నది. ఒక పూటవుంటే రెండోపూట పస్తు. అత్తగారి వుపచర్య, ఆమెకు ఆహారసమార్చన అత్యవసరమైన విధికృత్యములుగా నెరవేరుస్తూ రోజులు లెక్కపెట్టుకుంటూ వుంది కామమ్మ.

ఓసాయంత్రం నాల్గుగంటలవేళ తనస్థితి అయోమయంగావుంది బాధ ఎక్కువై భరింపరానిదిగావుంది. మంత్రసాన్ని పిలిచేందుకు మనిషికూడాలేదు. అత్తగార్కి దేనిమీద స్మారకమేలేదు. తన ప్రసవమెంత నిమిషములమీదవున్నదో అత్తగారిజీవిత మట్లే నిమిషములమీదనున్నది. చేతిలోకాని లేదు. పలుకరించు దిక్కులేరు. అట్టిసమయంలో వచ్చాడు అయిదువందల రూపాయల జుల్మానా వసూలు వారంటుతో ప్రభుత్వాధికారి. పాత్రసామాను బయట పారేశాడు. అలమరలోని పుస్తకాలు అన్ని జప్తు చేశాడు. కుక్కిమంచ మోటి వుంచమన్నది సిగ్గువిడిచి తనసంగతి చెప్పి. చింతాకుకూడ విడువనన్నాడు ఆ మానవరూపరాక్షసుడు. ముసలమ్మ అవసానసమయము. స్త్రీ ప్రసవబాధాసమయము. దిక్కులేని ఋగ్గాలు సిగ్గువిడిచి స్థితిచెప్పినది. జాలిపడలేదు

జప్తుచేయుటకు వెనుకాడలేదు. మరింత దౌర్జన్యము చూపినాడు. వాడిది హృదయముకాదు. పాషాణ మనుకొన్నది. అట్టివారిని మానవజాతిలో బుట్టించిన బ్రహ్మదేవునికి బుద్ధిలేదనుకొన్నది. కర్తవ్యము తోచక మిన్నకున్నది. ఆస్తినంతయు జప్తుచేసినను ఆమెకు చింతలేదుగాని, ప్రాణసమానమగు రాట్నము, భర్తఫోటో యీరెండును విడుచుట కామె సహించలేకపోయినది. ప్రసవవేదన బడుచున్న చూలాలిప్రార్థన విని కుక్కిమంచమైన విడువని క్రూరాత్ముడు పటము రాట్నము విడుచునా? అన్నియు నిల్లువిడచినవి. పూచికపుల్లమైన మిగులలేదు. అత్తగారు తనను విడచినది. యీ విపరీత విపత్తు చూడవచ్చిన యిరుగుపొరుగు మాచమ్మ మంత్రసానియైంది.

అయిదెకరముల మాగాణి వేలం వేయించాడు షేర్రాజా. అది బాకీక్రింద చాల్లేదని యిల్లుగూడా జప్తిచేయించాడు. పాత్రసామానులు పటాల్తోసహా ప్రభుత్వంవారు తీసుకున్నారు జుల్మానాక్రింద. అత్తగారు వెళ్లిపోయింది తన కొడుకు కోడళ్లస్థితి చూడలేక మామగారికి చెప్పటానికి. యిక మిగిలింది కామమ్మ, ముద్దులు మూటకట్టె మురిపెంపు బిడ్డ. ఆ చిన్నిబిడ్డకు 'మురళి' అని ముద్దుపేరు పెట్టుకొంది. వాడే తనకు సర్వస్వము అని పొంగిపోయేది. కాని పాలబుడ్డికైన పైసాలేని పాడుకాలము. కష్టాలెప్పుడు తీరుతవా అని కనిపెట్టుకొనియున్నది. నిత్యోపవాసాలుచేస్తూ ఆ బిడ్డమీద ప్రేమచేతను భర్తమీది కోరికచేతను ప్రాణవాయువులను బొందిలో నిల్పియున్నది. అందుకు ధైర్యము వుత్సాహము ఆమెకు ముఖ్యసాధనాలు.

కాంగ్రెసుకు ప్రభుత్వానికి రాజీ కుదిరింది. రాజకీయఖైదీలను విడిపించినారని కామమ్మ కెట్లో తెలిసినది. తన ప్రాణప్రియుడు తెల్లవారేడుగంటలకు రాగలడని వూహించినది. గడియారములేదు కాలము తెలియుటకు. కోడికూత వినపడుటలేదు. చంద్రుడింక పోకూడదా అని విడుగుకొన్నది. సూర్యుడు రానందుకు తిట్టిపోసినది. పతివ్రతాస్త్రీ కోపము వచ్చునేమోనని భయపడి సూర్యుడు బైటపడినాడు. వీధిగుమ్మమువంక సందడి వినిపించినది. జనము గుంపులుగా వచ్చుచున్నారు. తిర్గి చూచునప్పటికి శల్యమాత్రావశిష్టుడై కనులలో ప్రాణములుంచుకొని పాలిపోయిన దేహముతో మాసిపోయిన గుడ్డలతో పెరిగియున్న మీసగడ్డములతో నొక వింతవ్యక్తి తన కెదురుగా ప్రత్యక్షమైనాడు. తన ప్రాణసఖుడు విశ్వనాథమేనా? అవునని అంతరాత్మ చెప్పగనే ఆలింగనము చేసుకొన్నది. అత్తగారి మరణవార్త చెప్పినది. అయ్యో అని దుఃఖించు ప్రియుని ఓదార్చినది. షేర్రాజా చేసిన వెన్నుద్రోహము చెప్పలేదు. సర్వసూన్యముచేసిన సబ్ ఇన్స్పెక్టరు మాటనైన తలపలేదు. తనకు తోడుకాని బంధుగుల దూరలేదు. తాను తినుటకు తిండిలేక మలమల మాడిపోయిన మాటైన తలపెట్టలేదు. పాలులేక వేళ్లుచీక్కొను పసిపాప మురళిని తెచ్చి ముందుచూపి మురిసిపోయినది. విశ్వనాథం వికృతరూపము చూచి పసిపాప భయపడి దగ్గరకుపోలేదు. పాలబుగ్గలు పుణికి ముద్దులాడాడా దేశభక్తుడు. జైలుకుపోవునాడు భార్యాభర్తలిద్దరు ఒకరివంక ఒకరదోరకముగా కళ్లతో మాట్లాడుకొన్న మాటల్లోని అర్థము అప్పుడు తెలీలేదు. యిప్పుడో?

లోకల్ బోర్డుల ఎలెక్షనులకోసం, బస్తీలలోని సానివారికోసం అప్పులు చేసినవారికైన రక్షణనిచ్చిన రైతుచట్టం యీ నిర్భాగ్యుడికి వర్తించదుగా?

దేశంకోసం సర్వశూన్యమైన యీ నిరుద్యోగికి పునాదిమార్గం కాంగ్రెసు మంత్రులు కనిపెట్టరుగా?

యీ నిష్కళంకదేశభక్తులును త్యాగధనులును అయిన యీ ఆదర్శదంపతుల భావిజీవితం బాగు చేయవలసినది పాలకులా, ప్రజలా, భగవంతుడా?

సహస్రాక్షియైన భరతమాతయె సౌఖ్యమివ్వగలదు.

వూరే సత్యనారాయణ.